


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

రుద్ర విజయవాడలో ఉండగానే ఆసుపత్రిలోనే వరదయ్య చనిపోయాడు. అతని మరణం ఆ కుటుంబంతో పాటు రుద్రను బాగా కలిచివేసింది. తను వచ్చేందుకు ఇంకా కొద్ది రోజులు పడుతుందని చెప్తూ అబ్బిరెడ్డి ఆసుపత్రి వద్దకు రావడం గురించి చెప్పాడు మిత్రులకు.

వాళ్లు సందిగ్ధంలో పడిపోయారు. రుద్రకోసం అబ్బిరెడ్డి మనుష్యులు ఆరాతీస్తున్నారని పరమేశం చెప్పడంతో రుద్ర రాక పోవడమే మంచిదని చెప్పారు.

“జరిగినేదేదో జరిగిపోయినాది . మమ్మల్నాడ గుర్తు పడ్తారో అని నేను, స్వామి ,జార్జిలు బైటకి పోలే . వరదయ్య కుటుంబానికి అంతో ఇంతో ఆర్థిక సహాయం చేసి అంతా పూజారి, జాఫర్ చూసుకొంటుండారు ఇక ఈ పనులు ఇంతటితో ఆపేద్దాం . అబ్బిరెడ్డితో తలపడటం అంత మంచిది కాదనిపిస్తుంది. “ అన్నాడు బికారి.

మిగతా వాళ్లు అదే మాటన్నారు. వరదయ్య చావుతో వాళ్లకు భయం మరింత ఎక్కువైంది.

ఒక్క పూజారి మాత్రం అందుకు భిన్నంగా“. నువ్వు రారా తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం పాపం వరదయ్య భార్య పిల్లల్నుచూస్తుంటే జాలేస్తుండాది. వోళ్లను ఊరికే వదలాలనిపించడంలా నాకు. నేను మీ జతగాడు సిఐ అరవిందున్ని కలిసినా . అతనేం సెప్పిండంటే. వరదయ్యది ఆత్మ హత్య కాదనిపిస్తుండాదంట. ఆడ సిసి కెమరాలు లేకపోవడంతో ఏమైందో తెలియడం లేదనిండు. ఆయన సెప్పినేది నిజమేనేమో అనిపిస్తాండాది నాకు . వరదయ్య తనెంట పెట్రోలు తెచ్చుకోలేదని ఆర్జైసారు చెప్తుండాడు. ఆడికి పెట్రోలు యాడ్నుంచి వచ్చినాది. వరదయ్య అక్కడున్న పెట్రోలు తనే కొద్దిగేసుకొని బెదిరించే ప్రయత్నం సేసిండా . అంత మంది గుంపున్నా వరదయ్యను ఒక్కడు గూడా కాల్చుకోకుండా ఎందుకు ఆపలేకపోయింర్రు. కాల్చుకొన్నాకైనా చుట్టు అటు ఇటూ పరిగెత్తతూ వరదయ్య సుట్టు ఉండింర్రే కాని అంతమందిన్నా ఒకడు కాకపోతే ఒకడన్నా మంటలు ఆర్పే ప్రయత్నం ఎందుకు సేయలా. అర్పనేకి పోయే మాకు

ఎందుకడ్డపడింద్రు  ఇయన్ని ఆలోసిత్తుంటే వరదయ్యను సంపినారనే అనిపిస్తాండాది కాకపోతే పెట్రోలు వరదయ్య మీదేసుకొని బెదిరించడం విన్నానేను ఆరై ఇన్నాం. వరదయ్య చనిపోయే ముందు ఏదో చెప్పాలని సానా తపన పడిండంట కాని ఏమి సెప్పలేక పోయిండంట. తాను కాల్చుకోలేదని చెప్పాలనుకొన్నాడో లేక కాల్చిన వోళ్లెవరో సెప్పాలనుకొన్నాడో .పోస్ట్ మార్టమ్ రిపోర్టులో  ఏమొస్తాదో చూడాలన్నాడు.“ అని చెప్పాడు.

రుద్ర అరవిందుకు ఫోన్ చేసాడు. వరదయ్య చావుకు కారణమైన సోమిరెడ్డిని అబ్బిరెడ్డిని రాజకీయాలకు తలొగ్గి వదలొద్దని.

“నువ్వు చెప్పాల్సిన పనిలేదురా రుద్రా.  రాజకీయ వత్తిళ్లకు నేను లొంగేది లేదు . నేను చేసేది చేసినా .  వరదయ్య ఆత్మ హత్యచేసుకోలేదని అబ్బిరెడ్డి సోమిరెడ్డితో కలసి  ఈ పని చేసారని వరదయ్య భార్య చేత కేసు  పెట్టించి ఆ సోమిరెడ్డి గాన్ని లోపలేసి ఉతికేస్తే అంతా బైట పడ్తుందనుకొన్నా అలాగే చేసినా కాని  సోమిరెడ్డిని అరెస్టుచేసినా గంట  తిరగకముందే పొలిటికల్ పవర్తో  అబ్బిరెడ్డిబెయిల్ మీద సోమిరెడ్డిని  బైటికి తెప్పించాడు. అబ్బిరెడ్డిని నామ మాత్రపు విచారణ చేసేందుకు కూడా వీలు పడలేదు. పోనీ పోస్ట్ మార్టమ్ రిపోర్టులో నైనా హత్య అని తేలుతుందేమో అనుకొంటే దాన్నికూడా తారు మారు చేయించినట్లుంది దాని నివేదిక కూడ ఆత్మహత్యే అని వచ్చింది. అందువల్ల వరదయ్యది ఆత్మహత్యగానే ట్రీట్ చేయాల్సి వస్తుంది. “

ఎంకట్రెడ్డిని ఇంటికి  తీసుకొచ్చాక  ఆత్రంగా కలిసారు మిత్రులు.

అబ్బిరెడ్డితో విరోధం వదిలేయడం మంచిదని నచ్చ చెప్ప చూసారు రుద్రకు .కాని నిర్ణయం మార్చుకోక పోవడంతో మొదట పూజారి ఒక్కడే వెంట ఉన్నా తర్వాత మిగతా వాళ్లు కలిసారు రుద్రతో  .అప్పటికే పత్రికా విలేఖరి రమణ మండలాపీసు ముందు కొంతమందిని కూడగట్టుకొని ధర్నాలు చేయిస్తున్నాడని తెలిసింది దానికి తోడు ,  వాట్సప్ ట్విటర్ వేదికలను చేసుకొని జరిగిన అన్యాయన్ని బట్ట బయల చేసాడు రుద్ర. దాంతా వార్త వైరల్ అయ్యింది. అంతటితో వదిలేయకుండా  యువకుల్ని కూడగట్టుకొని వరదయ్యకు జరిగిన అన్యాయం గురించి కలెక్టరేటు ముందు ధర్నాలు చేయించాడు . కలెక్టురు జోక్యం చేసుకోక తప్పలేదు. ఆర్డివోను విచారణకు వేసి జరిగింది వాస్తవం అని తేలడంతో కంప్యూటర్ అసిస్టెంటును ,తప్పుచేయించిన తహశిల్దారును చూస్తూ తెలిసి మౌనంగా ఉన్న  ఆరై విల్సన్ ,విఆర్వోలను సస్పెండు  చేయించాడు.  విల్సన్ స్థానంలో ఎవరు చేరకపోవడంతో పరమేశమే ఆగ్రామాలకు ఇన్ చార్జ్ గా ఉంచారు. కొత్త తహశిల్దారు పిళ్లై  వచ్చాడు. అతను  రాజకీయాలకు తలవొగ్గే కాదు కాదని పేరు ఉంది.కత్తులు కొడవల్తో తిరిగిన ఫ్యాక్షన్ మండలాలాల్లో నిర్భయంగా పనిచేసినోడు. అంతో ఇంతో  నైతిక  విలువలున్నవాడు. ముందు తహశిల్దారు లాగా మూర్ఖుడు కాదు. కలెక్టరు ఉత్తర్వుల మేరకు రెవిన్యూ రికార్డుల్లో  వరదయ్యకు జరిగిన తప్పును సరి చేసి అతని భార్య  పేర భూమి రాసి

పాస్ బుక్కు ఇప్పించాడు . అలాగే సోమిరెడ్డి పొలంలో కాలువ తీయించి వరదయ్య పొలం వరిపైరు నాటించాడు. ఇది జరిగే సమయంలో అబ్బిరెడ్డి కొడుకు దగ్గరికి అమెరికాకువెళ్లాడు. అబ్బిరెడ్డిని ఎదురిచ్చి మాట్లాడింది రుద్ర అని తెలిసిన మరుక్షణమే సోమిరెడ్డి, అబ్బిరెడ్డికి ఫోన్ చేసి చెప్పాడు.

“అన్నా నిన్ను వరదయ్య గాడి ఇషయంలో నిన్ను మాటాడినోడు ఎవరో తెలిసినాదన్నా వోడి కాళ్లు సేతులు ఇరిసేయిస్తాని చూసినా కాని వోడు ఎవడో కాదు మన ఎంకటాపురం ఎంకట్రెడ్డి కొడుకు. “ అని చెప్పాడు.

అబ్బిరెడ్డి బుర్ర గిర్రున తిరిగింది.

“ఏందిరా నువ్వు సెప్పేది. “ అన్నాడు.

“అవునన్నా నేనే సెప్పేది నిజమే వోడు ఎంకట్రెడ్డి కొడుకేనంటా పేరు రుద్ర అంట. జతగాళ్లనేసుకొని మండలంలోన ఎవరికన్నా ఏదన్నా అన్నాయం జరిగే వోడికి ఫోన్ చేయమని పాంప్లెట్లుకూడా కొట్టించిడంటా . ఇప్పుడు వోళ్లే ఆ అరవింద్ గాడితో సహాయంతో అంతా సేస్తాండారు. నువ్వు ఏదో ఒకటి సేయాలన్న లేకుంటే అంతా తారుమారైపోతాండాది.“ అబ్బిరెడ్డి తహశిల్దురుకు ఫోన్ చేసి వరదయ్యకు ఏలాంటి సహాయం చేయవద్దని చెప్పాడు. కాని పిళ్లై సరే అన్నాడేకాని తన పని తాను చేసుకపోయాడు. పిళ్లైతన మాట వినక పోవడంతో కలెక్టరుకు ఆర్డీవోలకు మినిష్టర్లచేత చెప్పించాడు. కాని పరిస్థితి చేయి దాటిపోయిందని ఏమి చేయలేమని చెప్పడంతో

కక్కలేని మింగలేని పరిస్థితి అయ్యింది అబ్బిరెడ్డికి. ఒక పక్క తనకు వ్యతిరేఖంగా పనులు జరగడం రెండోది తనను తిట్టిన రుద్రగురించి ఆలోచనలు కంటి మీద కునుకులేకుండా చేసాయి. “ఆ రుద్ర గాడికి తనెవరో తెలిసే ఉంటాది. ఆసుపత్రికాడికి వచ్చినప్పుడు తనెవరో తెలిసే తెలియనట్టుండినాడు. ఎంకట్రెడ్డిక్కూడా విషయం తెలిసింటాదా . తనను దెబ్బతీయాలని అబ్బాకొడుకలిద్దరు కలిసి నాటకమాడుతుండారా. ఒకేలా ఎంకట్రెడ్డికి ఇషయం తెలియకపోయినా తను వోడికి ఫోన్ చేసి ఎంకట్రెడ్డి నీ కొడుకు ఇట్టా తిట్టిండు అని ఎట్టా సెప్పాలా అట్టాగని రుద్రను అలా వదిలేస్తే వోడు **మరింత** రెచ్చిపోతాడేమో అని అలాగని వోడ్ని ఏమైనా చేస్తే .....ఎన్నికలు దగ్గర పడుతుండగా ఎంకట్రెడ్డి తనకు అపోజిషనైతే ఇబ్బందైతాదేమో”

సోమిరెడ్డికి రుద్ర వల్లే తనకు వరదయ్య భూమి తనకు దక్కకుండా పోయిందని ఏలాగైన అబ్బిరెడ్డి సహాయంతోనే రుద్ర మీద పగతీర్చుకోవాలని “ ఏం సేస్తామన్నా వాడ్ని “అని అంటూ పదే పదే అబ్బిరెడ్డిని రెచ్చగొట్టసాగాడు సోమిరెడ్డి.

“కాని ఆ నాకొడుకు ఎంత విర్రవీగుతాడో విర్రవీగనిలే. నువ్వు ఏమి తెలియనట్టు ఉండు. నేను వచ్చినాక సూస్తాం ఏం చేయాలో . “ అని చెప్పాడు.

అబ్బిరెడ్డికి తనెవరో తెలిసిపోయి ఉంటుంది అయినా ఎందుకు మౌనంగా ఉన్నాడో అర్థం కాలేదు రుద్రవాళ్లకు. అందుకే అబ్బిరెడ్డిగురించి తను అతనికి వ్యతిరేఖంగా చేస్తున్న పనులుగురించి అనారోగ్య పరిస్థితిలో ఉన్న తన తండ్రికి తెలియకపోవడమే మంచిది అనుకొన్నాడు.

జరిగిన సంఘటనతో తహశిల్దారు ఆఫీసు స్టాపులో భయం పుట్టుకొచ్చింది. డిప్యూటి తహశిల్దారు క్లర్కు రుద్రతో గొడవ పెంచుకోకపోవడం వల్ల మంచి జరిగిందనిపించింది. ఇప్పుడు కాని పనులు చేస్తే ఉద్యోగానికి ముప్పు చేస్తే అబ్బిరెడ్డితో తంటా ఎందుకని డిప్యూటి తహశిల్దారు, సర్వేయరు సెలువులో వెళ్లిపోయారు. కొత్త వారిని వేసినా ఎవరు రాకపోవడంతో పనిష్మెంట్ ప్లేజుగా ముద్రపడింది మండలం. ఉన్న స్టాపుతోనే నెట్టుక రాసాగాడు తహశిల్ధారు. స్టాపునందర్ని పిలిచి గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు ఎవరో వచ్చి తాము చేసే పనులు వేలెత్తి చూపడం సిగ్గు పడాల్సిన విషయమని ఇక ముందు చేయాల్సిన పనులుకు తిప్పుకొన్నా కొర్రి వేసినా కలెక్టరు సరెండరు చేస్తానని బెదిరించాడు. దాంతో ఆఫీసులో స్టాపుతో పాటు విర్వోలలో కూడా మార్పు వచ్చింది. తమ వద్దకు వచ్చిన అర్జీలు చేయగలగినవి వెంటనే చేయసాగారు.

అబ్బిరెడ్డితోను అతని అనుచరుల్తోను సమస్యలున్న వారు ఎవరు వరదయ్య మరణం తర్వాత ఫిర్యాదు చేసేందుకు ధైర్యంచాల్లేదు. దాంతో చాల మటుకు భూతగాదాలన్ని అలాగే నిలబడిపోయాయి. అవి, కోర్టు కేసులు తప్ప చాలా మటుకు పరిష్కారం కావడంతో చాలా మందికి ఆఫీసు చుట్టు తిరగాల్సిన పని తప్పింది. ఒకప్పుడు గుంపులు గుంపులుగా వస్తున్న జనం పలచబడి ఆఫీసంతా ఖాళీ కనపడసాగింది. ఉత్యాహం పుంజుకొన్న రుద్ర తన బృందంతో ప్రజలతో ప్రత్యక్ష సంబంధమున్న రిజిస్టారు, మున్సిపల్ , మెడికల్ , ఎంపిడివో ఆఫీసుల్లో తన పాంప్లెంట్సు పంచారు కాని అక్కడ్నుంచి తమకు పనులు జరగలేదని కాల్స్ రాలేదు ఎవరికి వాళ్లు డబ్బులిచ్చుకొంటు పనులు చేయించుకోవడంతోను రెవిన్యూ డిపార్టమెంటులోలోగా సమస్య ఇద్దరి మధ్యలేకపోవడంతో ఒకటి రెండు కాల్స్ కన్నా ఎక్కువ రాలేదు. కొద్ది కాలంలోనే రుద్ర పేరు మండలంలో చాలమందికి తెలిసిపోయింది .

విషయాలన్ని తెలుసుకొంటున్న అబ్బిరెడ్డిలో పగ, కక్ష రగులు కుంటునే బడబాగ్నిగా మారి రుద్రను ఏమి చేయలేక మరొకర్ని దహించేందుకు అక్కడ్నుంచి పథకం వేసాడు అబ్బిరెడ్డి.

అప్పుడే విరిసిన ముద్ద మందారంలా ఉందా అమ్మాయి. చూపులు పక్కకు తిప్పుకోలేక పోయాడు రుద్ర.అలా చూడటం సంస్కారం కాదని మనసు మొత్తుకొంటున్నా కళ్లు మనసు మాట వినకపోవడంతో, “రా రుద్ర“ అని పరమేశం పిలిచేంత వరకు చూపులు తిప్పుకోలేక పోయాడు. పరమేశం నిర్మలను పరిచయం చేస్తూ మా అమ్మాయి నిర్మల అన్నాడు. నిర్మల అరమోడ్పు కన్నులను పూర్తిగా తెరిచింది. నల్లని తటాకంలో రెండు తెల్లని తామరలు విచ్చుకొన్నట్లున్న ఆమె చూపుల్తో తన చూపులు కలిసిపోగా మనసు పరిసరాలను మరిచిపోయింది. నిర్మల రుద్రను మర్యాదపూర్వకంగా“ హల్లో“ అని నవ్వుతూ పలకరించే సరికి మరింత పులకరించిపోయాడు రుద్ర. రూపమే కాదు తీయటి స్వరానికి నవ్వినప్పుడు బైటపడ్డ తెల్లని పలువరుస ,ఆమె రూపం నవ్వు మనసులో పదిలంగా నిలచిపోతుంటే “హల్లో “అన్నాడు ఏదో ఊహాలోకంలో తేలిపోతూ. .

ఓ శుభవార్త ఉందంటూ. రుద్రను అతని బృందంతో పాటు భోజనానికి రమ్మని పిలిచాడు పరమేశం. కారణం చెప్పలేదు. అతనికి ప్రమోషన్ రావడమో లేక పెళ్లికి ఎదిగిన కూతుర్లుకాని కొడుకులుకాని ఉంటే పెళ్లి కుదరడమో జరిగి ఉంటుందని అనుకొన్నారు. నిర్మలను చూచాక రుద్ర ఆ శుభ వార్త ఆ అమ్మాయి పెళ్లి మాత్రం కాకూడదనుకొన్నాడు అంతలా నిర్మల రూపం అతని మనసులో నిండిపోయింది. లోపలికి వెళ్లగానే “ ఇదిగో వాడు మా కొడుకు చందు బిటెక్ చేస్తున్నాడు. ఆమె నా భార్య “అంటూ తన కుటుంబాన్ని పరిచయం చేసాడు పరమేశం.. అలాగే రుద్రను మిగతా అతని స్నేహితుల్ను పరిచయం చేసాడు ఇంట్లో వాళ్లకు. “ మీరు చేస్తున్న పనులు బాగున్నాయి“ అంది. నిర్మల.

“మాట్లాడుతూ భోంచేయవచ్చు పదండి “.అన్నాడు పరమేశం .

“శుభవార్త ఏమిటో చెప్పండి సార్“ అన్నాడు బికారి. రుద్రకూ ఆ విషయమేమిటో తెలుసుకోవాలని ఆత్రుత పెరిగింది.

“భోంచేసాక చెప్తాను “అని పరమేశమంటే ,

“లేదు సార్ ఇప్పుడే సెప్తే మరో ప్లేటు ఎక్కువ లాగించవచ్చు కదా అని బికారి గాడి ఆలోచన“ అన్నాడు పూజారి. పక్కున నవ్వారంతా.

ఆ నవ్వుల మధ్యనే చెప్పాడు పరమేశం.నిర్మల ఆర్డివో కాబోతుందని !

“ఒక్కసారిగా ఆర్డివో నా . “ అంటూ ఆశ్చర్య పోతూ చూచారు. .రుద్రకు ఆనందమేసింది .

“అవును . చాలా నెలల ముందే పోస్టింగ్ రావాల్సింది. కోర్టులో పెడ్డింగ్ ఉండటం వల్ల ఆలస్యమైంది.. తను ఇంకా సివల్స్ ప్రిలిమ్స్, మేయిన్ పాసైంది కాని ఇంటర్వ్యూలో పోయింది. లేక పోతే ఏ కలెక్టరో అయ్యేది కూడా “అన్నాడు కూతురి గురించి గర్వంగా చెప్తూ..రుద్రకు అప్పుడు గుర్తుకొచ్చింది. తనతో పాటు ప్రిలిమ్స్ ఎగ్జామ్ రాసేటప్పుడు చూసాడామెను. నిర్మల రుద్రను చూడలేదు కాని రుద్ర మాత్రం చూసాడు .అప్పుడే నిర్మల రూపం మనసులో ఉండి మళ్లీ ఎప్పుడైనా కనిపిస్తుందేమో అనుకొనే వాడు అప్పడప్పుడు ఆ రూపం గుర్తుకొచ్చినప్పుడు..

“అయితే ఇంకేం సార్ రుద్ర నాయన్తో చెప్పి మన జమ్మలమడగు డివిజన్కే ఏపిస్తే సరి “ అన్నాడు పూజారి

“ నో రెకమెండేషన్స్ . ఎక్కడికి వేస్తే అక్కడికి పోవడమే “అంది నిర్మల నిర్మొహమాటంగా .తండ్రికి తగ్గ తనయ అనిపించింది.

“మీరు మా రుద్ర లాంటి వారే నన్న మాట వీడు డిఎస్పీగాబోతున్నాడు. వీడికి రెకమెండషన్ అంటే గిట్టదు లేకుంటే ఇద్దర్ని మన డివిజన్ కే వేసుకొంటే బాగుంటాది చానా మంచి పనులు సేయచ్చు “అన్నాడు పూజారి.

పరమేశంతోపాటు, నిర్మలకూడా ఆశ్చర్యపోయింది.

పరమేశం చెప్పినప్పుడు పెద్దగా పట్టించుకోలేదు కాని రుద్రగురించి పూర్తిగాతెలిసిన తర్వాత అంత ఆస్తి పలుకుబడి పెట్టుకొని పెద్ద ఉద్యోగం రాబోతున్నా కూడా మండలంలో ఇలాంటి పనులు చేస్తుండటాన్ని చూచిన నిర్మల ఆశ్చర్యంతో పాటు ఆలోచనలో పడేసింది.

నిర్మలకు ఆర్ఐ ,విర్వో ట్రైనింగ్కు చిత్తూరు జిల్లాకు అలాట్ చేయడంతో . పరమేశం ఓ రెండువారాలు సెలువు పెట్టి పనిలో పనిగా తిరుమల, శ్రీకాళహస్తి కొన్ని పుణ్యక్షేత్రాలకు వెళ్లి తర్వాత చిత్తురులో నిర్మలను జాయిన్ చేయించి ఆమె అక్కడుండేందుకు ఏర్పాట్లు చేసి వచ్చాడు. తర్వాత వచ్చి ఆఫీసులో కూర్చుని వచ్చిన అర్జీలు చూస్తుండగా" నమస్కారం సారు" అంటూ వచ్చాడొకతను. తన వంక ప్రశ్నార్థకం చూస్తున్న పరమేశంతో ఆ వచ్చిన వ్యక్తి "ఎన్నిసార్లు తిరగాలి సారు మీ చుట్టు పని సేయకుండా తిప్పుకొంటున్నారు. " అన్నాడు కోపంగా. అతను ఎవరనుకొని ఎవరి దగ్గరి వచ్చాడో అని ఆగు అరవమాకు అంటూ చేయిఎత్తి చూపాడు పరమేశం. " అట్టాగే సారు మీరు అడిగిన అయిదువేలు ఇస్తా పని తొరగా సేయండి సారు " అంటూనే జేబుల్లోంచి పది అయిదు వందల నోట్లు పరమేశానికి ఇవ్వబోయాడు. " ముందు ఆ డబ్బులు జేబులో పెట్టుకొని నీ పేరు ఊరి వివరాలు చెప్పు నీ అర్జీ ఉందేమో చూస్తాను" అన్నాడు పరమేశం.

"ఊరు మిట్టమానిపల్లె సారు పేరు అల్లం కోదండం "

తను లేకుంటే వచ్చిన టపాలు తన కుర్చీ పక్కనున్న పెట్టెలో కాగితాలు వేయడం అలవాటు అటెండరుకు. ఊరికి పోయినప్పుడు లోపలేమైనా వేసాడేమో నని పెట్టెతెరిచి చూస్తుండగానే కోదండం అర్జీ కనపడింది. తను ఊరికి పోగానే వచ్చినట్లుంది. అర్జీ చూస్తుండగానే . కోదండంకు ఫోన్ వచ్చింది . అతను ఫోన్ ఎత్తి హల్లో అని కట్ చేసి బైటికి పోతుంటే అతన్ని పిలిచాడు పరమేశం . పలక్కుండా బైటికి పోతుంటే అప్రయత్నంగా టేబుల్ మీద ఉన్న అతడుంచిన డబ్బును చూచి వీడెవడో తిక్క వెదవలా ఉన్నాడే అనుకొంటూ, ఆ డబ్బులు తీసుకొని అతనికి ఇచ్చేందుకు బైటికి వస్తుంటే, బిల బిల మని కొంత మంది లోపలికి వచ్చి డబ్బులున్న పరమేశం చేతిని పట్టుకొన్నారు . ఎవరు మీరు నా చెయ్యి పట్టుకొంటున్నారెందుకు అన్నాడే కాని అప్పటికే అతనికి తనను ఎవరో ట్రాప్ చేసారని అర్థమైంది "వాడెవడో నా టేబుల్ మీద డబ్బులు పెట్టిపోయాడు" అని చెప్తున్నా , "అలాగా సరే పద ముందు తహశిల్దారు దగ్గరికి " అంటూ బలవంతంగా పరమేశం డబ్బులు పట్టుకొన్న చేతిని పట్టుకొని దాంతో పాటు టేబుల్ మీద నున్న కోదండం అర్జీని తీసుకొని తహశిల్దారు చాంబరులోపలికి పోతూ అడ్డుపడిన అటెండరు పక్కకుతోసి లోపలిపోయారు వాళ్లు. పరమేశానికి పూర్తిగా అర్థమైంది . తనను ఏసిబి ట్రాప్ లో ఇరికించారని . పరమేశాన్ని బలవంతంగా ఈడ్చుకొస్తుండటంతో తహశిల్దారు పిళ్లై అర్థంకాక కోపంగా" ఏమనుకొంటున్నారు నా ఎదురుగానే ఆర్ఐని అలా ఈడ్చుకొస్తున్నారు "అనగానే వాళ్లలలో ఒకడు తన ఐడింటిటీ చూపిస్తు" తహశిల్దారుగారు మేము ఏసిబి నుండి వచ్చాం. ఇతను లంచం తీసుకొంటుండగా రెడ్

హ్యాండడ్ గా పట్టుకొన్నాం “అన్నాడు. విస్తుపోయిన తహశిల్దారు “నో నో మీరు పొరబాటు పడతున్నారు అతను లంచం తీసుకోవడమేమిటి అతను చాలా హానెస్టు “ అన్నాడు.

“అది కోర్టులో తేలుతుంది సార్ మాకు అల్లం కోదండం అనే అతను పరమేశం అనే ఆర్ఐ . తన పని చేయకుండా తిప్పుకొంటూ లంచం డిమాండు చేస్తున్నాడని లిఖిత పూర్వకంగా కంప్లైంటు రాసిచ్చాడు. దానితో మేము అతన్ని ట్రాప్ చేసాం.డబ్బులు తీసుకొని పనేచేసేందుకు సిద్దమై బైటికి తీసిన అతని అర్జీ. ఇదిగో ఇవి మేము కోదడం కు ఫినాప్తలిన్ పౌడర్ పూసి ఇచ్చిన కరన్సీ . వాటిని లంచమడిగిన ఆరైకి ఇవ్వమనిచెప్పాం. అతను ఆరైకి ఇవ్వగానే అవి అతని చేతిలో ఉండగానే మేము పట్టకొన్నాం దాన్ని మేము వీడియో తీసాం. “ అని , సోడియం కార్బనేట్ సొల్యుషన్తో పరమేశం కుడి చేతిని కడగసాగారు నోట్లకున్న ఫినాప్తలిన్ పౌడరు చేతికి అంటుకోవడంతో సోడియం కార్బనేట్ సొల్యుషన్ తగలడంతోనే చేయి పింక్గా మారడం , నోట్లపైన కూడా సోడియం కార్బనేటు సొల్యుషన్లో ముంచిన దూదితో రుద్దడంతో అవికూడా పింక్ కలర్ లోకి మారిపోవడం వీడియో తీసుకొన్నారు. ఇదంతా జరిగేటప్పుడు పిటీషనర్ అల్లం కోదడం తో సహా మరో ఇద్దరు సాక్ష్యాలను తప్ప లోపలికి ఎవర్ని రానీయకుండా తతంగమంతా పూర్తి చేసుకొని పరమేశాన్ని అరెస్టు చేసి తీసుకపోయారు. తహశిల్దారు పిళ్లైకి పరమేశం ఏలాంటి వాడో తెలిసిన నిస్సహాయంగా చూస్తూ ఉండటం తప్ప ఏమి చేయలేక పోయాడు.. తప్పు చేయకపోయినా తలదించుకోవాల్సి వస్తున్నందుకు ముఖమంతా పాలిపోయింది పరమేశానికి .

ఎంకట్రెడ్డికి ఉన్న బలం ,బలగం దృష్ట్యా రుద్ర మీద పగ తీర్చుకోవడానికి వెనకడుగు వేసిన అబ్బిరెడ్డి అమెరికా నుండి రాగానే పరమేశం మీద తన ప్రతాపం చూపాడు. దాని ఫలితమే పరమేశం ఏసిబి ట్రాప్ . అనుకొన్నది అనుకొన్నట్లు తను వేసిన ఎత్తుగడతో పరమేశం చిత్తుకావడంతో రుద్రను చావుదెబ్బ కొట్టినట్లు సంతోష పడ్డాడు అబ్బిరెడ్డి. పరమేశం గురించి తెలిసిన రుద్ర బాధ పడిపోయాడు. నిర్మల చిత్తూరు ఎమ్మల్యే ద్వారా ఎసిబి వాళ్లకు చెప్పించింది. తమ విచారణలో ఆరై మంచివాడని తెలిసి ఆలస్యం చేసేకొద్ది చాలా రోజుల్నుండి తమపైన వత్తిడి వస్తుండటంతో వచ్చామని అతను అంత అమాయకంగా దొరికి పోతాడని మేము ఊహించలేదని చెప్పారు. తాము చేయగలిగింది ఇప్పుడు ఏమి లేదని చెప్పారు. కేసు ఫైల్ చేయడంతో కస్టడికి తీసుకొన్నారు పోలీసులు. రుద్ర తన తండ్రితో అబ్బిరెడ్డికి తనకు మధ్య ఏం జరిగింది చెప్పి, తనను ఏమి చేయలేక పరమేశాన్ని ఏలా ట్రాప్ చేయించాడో చెప్పి బెయిల్ ఇప్పించే ప్రయత్నం చేసేలోగా, చిత్తూరు ఎమ్మల్యేనే మరుసటి రోజే బెయిల్ మీద బైటికి తెప్పించాడు పరమేశాన్ని. దాంతో అప్పుడుకూడా తండ్రికి అబ్బిరెడ్డిని గురించి చెప్పే అవకాశం కలగలేదు రుద్రకు.

ఆరు నెలలో సంవత్సరమో సస్పెండు చేస్తారని తర్వాతే పోస్టింగ్ ఇస్తారని. అంతవరకు అర్ధజీతమే ఇస్తారని , కేసు తెగినంతవరకు ప్రమోషన్సు రావన్న సమస్యలకన్న తన మీద పడ్డ మచ్చకు క్రుంగిపోయాడు. దానికి తోడు రెకమెండేషన్కు దూరంగా ఉండే నిర్మల ఎమ్మెల్యే ద్వారా బెయిల్ ఇప్పించడం పరమేశాన్ని ఆలోచనలో పడేసింది. పైకి గంభీరంగా

ఉన్నాలోలోపల కృంగిపోతున్న పరమేశంను చూచి ఇంటిల్లిపాది ధైర్యం కోల్పోయారు. రుద్ర దగ్గరుండి వాళ్లకు ధైర్యం చెప్పి ఊరడించి రెండు మూడురోజులు బైటనుండి భోజనాలు తెప్పించి బలవంతగా తినేలా చేసాడు. నిర్మల ట్రైనింగ్ పోవాల్సి ఉండటంతో ఇక్కడే పరమేశముంటే మరింత కృంగి పోతాడని తనకు తోడు ఉంటారని అందర్నీ తన దగ్గరికే రమ్మని చెప్పింది నిర్మల . అది మంచిదన్న నిర్ణయానికి వచ్చి పరమేశం కుటుంబంతో కలిసి చిత్తూరు వెళ్లిపోయాడు.

ఎంకట్రెడ్డి ఆరోగ్యం నయమైంది . ఎక్కడికి బైటికి పోవడంలేదు. ఆరు బైట పడకకుర్చిలో కూర్చొని కునికిపాట్లు పడుతుంటే సావిత్రమ్మ , రుద్ర నాయనమ్మ పక్కనున్న అరుగు మీద కూర్చొని దీపారాధనకు వత్తులు చేసుకొంటున్నారు. రుద్ర కూడా ఇంట్లోనే ఉన్నాడు. అబ్బిరెడ్డి గురించి చెప్పాలని చాల రోజుల్నుంచి అనుకొంటున్నాడు రుద్ర. ఆరోగ్యం దృష్ట్యా ఎప్పటికప్పుడు వాయిదా వేస్తునే వస్తున్నాడు. ఇప్పుడు చెప్పాలనే బైటికి వచ్చాడు. అంతలోనే ఫోన్ రింగైంది.

“సారు మీరెవరో నాకు ఎరికలే . ఈడ ఆఫీసుకాడికి వచ్చినా . ఈడ ఎవరు పలకలా . ఎవడో పుణాత్ముడు ఫోన్ సేసి నాకిచ్చి నీతో మాట్లడమనిండు. ...నా పిల్లగాడికి జబ్బుసేసినాది. ఆసుపత్రికి పోతే గుండె జబ్బని సెప్పి ఎంటనే ఆపరేషన్ సేయాలనింద్రు ప్రెబుత్వాసుపత్రిలో సేయలేరంటా ..ప్రయేటు ఆసుపత్రికి పొమ్మన్నింద్రు . ఆడ రేశన్ కార్డుంటే ఫ్రీయిగా సేస్తరని సెప్పింద్రు .. మాకు రేషన్ కార్డులేదయ్యా ఎన్ని సార్లు పెట్టినా పైసలీయలేదని ఇయ్యలా. ఇప్పుడు పీకలమీదికి ఒచ్చినాది. నాకు బియ్యము ఏమొద్దయ్య కార్డుతో పిల్లగాడి కి రోగం బాగైతే సాలు. మీరందరికి సగయాం సేస్తరంటా ఆపీసులో సెప్పి నాకు రేశన్ కార్డు ఇప్పించయ్య నీకు పుణ్మముంటాది. “తన బాధనంతా వెళ్లబోసుకొంది ఆమె..

“ఏ ఊరమ్మ మీది.. “..

“మాది తిమ్మాయి పల్లెసారు. ఒంటిదాన్ని .అన్నతమ్ములు అక్కసెల్లెలెవరు లేరు. గాజులకద్దంగా తాగుబోతు మొగుడుండాడు. కూలి నాలి సేసుకొని బతుకుతుండా. ఈ పిలగాడిమీదే పానాలన్ని పెట్టుకొని ఉండా మీకాళ్లట్టుకొంటా పిలగాడి పాణం కాపాడండి. ఆఫీసోల్లు పలకడంలా. “

“సరే నువ్వక్కడే ఉండమ్మ. “ అని వెంటనే ఈ మధ్య కాలంలో పరిచయమైన సీనియర్ అసిస్టెంటుకూ ఫోన్ చేసి రేషన్ కార్డుసంగతి ఒక వేళ కార్డులేక పోతే పరిస్థితి ఎమిటని అడిగాడు.

“ రేషన్ కార్డులు ప్రోగాం పెట్టినప్పుడే ఇస్తారు కాని ఎప్పుడంటే అప్పుడివ్వరు . ఆమెకు పిల్లవాడి ఆపరేషన్ కోసం కలెక్టరుకు లెటర్ పెడ్తే కలెక్టరు ఉత్తర్వుల్తో సహాయం పొందవచ్చు. కాని తహశిల్దారు ,డిప్యూటి తహశిల్దారు ఇద్దరు సెలవులో ఉన్నారు. ఇన్ చార్జ్ తహశిల్దారుకూడా అందుబాటులో లేడని అటెండరు తపాలు వెనక్కి తీసుకొచ్చాడు. అందువల్ల ఆ ప్రాసెస్ లో సర్టిఫికెట్టు పొందడానికి కనీసం ఎంత త్వరగా చేసినా రెండుమూడు రోజులైనపడుతుంది.పిల్లోడి పరిస్థితి బాగోలేదనిపిస్తుంది. రెండు సార్లు గుండెనొప్పి వచ్చిందంటా....చూస్తుంటే బాధగా ఉందన్నా కాని ఏం చేయలేని పరిస్థితి.. “అని చెప్పాడు.

రుద్ర ఫోన్లో మాట్లడుతుంటే మెలుకువ వచ్చింది ఎంకట్రెడ్డికి . రుద్ర ఆందోళన పడతుండటం చూచి “ ఏమైందిరా ఎవరు పోన్ చేసింది “అన్నాడు.

“ ఎవరో బీదామె . పిల్లోడికి బాగలేదట. ఆసుపత్రికి పోతే గుండె జబ్బని తెలిసిదంటా.. “అన్నాడు.

“దీనికి భయపడేది దేనికి ఆరోగ్య శ్రీ పతకం క్రింద ఫ్రీగా సేస్తారకదరా . నా కట్టానే సేసింద్రని రాజేంద్ర చెప్పిండు.“ అన్నాడు ఎంకట్రెడ్డి.

విస్తు పోయాడు రుద్ర. ఆ రోజు రాజేంద్ర తను డబ్బులు గురించి అడిగితే ఎందుకు దాటవేసాడో ఇప్పుడు అర్దమయ్యింది. తండ్రి వైపు చూచాడు. ఆ క్షణంలో అతను నేరస్థుడిలా కనపడ్డాడు. తన దగ్గర పెద్ద పాత్ర నిండా రకరకాల ఆహార పదార్ధాలు పిండి వంటలు పెట్టుకొని, పక్కన ఓ ప్లేటులో పచ్చడన్న తినబోతున్న నిస్సహాయురాలిచేతిలోంచి అది లాక్కొని తినేసి నింపాదిగా చూస్తున్న వ్యక్తిలా కనపడ్డాడు

“ ఏమైందిరా అంటే పలకవేందిరా “ అన్నాడు ఎంకట్రెడ్డి.

ఆవేశం తన్నుకొచ్చింది రుద్రకు.

“ అవు. మనకంటే రెకమెండేషనుండి కోట్లు ఆస్తి ఉన్యా కార్టు వచ్చినాది . పైసా ఖర్చులేకుండా ఆపరేషన్ అయినాది. . పాపం బీదది.నోరు లేంది.వోళ్లకు కార్టు ఎవరిస్తారు. అదే జరిగినాది. డబ్బులియ్యలేదని ఎన్ని మార్లు అర్జీ పెట్టిన రేషన్ కార్డియ్యలేదంట ఆఫీసోళ్లు. ఏం సేస్తాం అట్టా ఉండాది మనోళ్ల నిర్వాకం. పేదలకోసం పెట్టిన పథకం. ఎవరెవరో చేస్తున్న తప్పులు వల్ల, నిర్లక్ష్యం వల్ల , అవినీతి వల్ల నిజమైన పేదలకు దక్కడం లే. కోట్లు ఆస్తి ఉన్న మనలాంటోళ్లు దర్జాగా ఆ కార్డులు పెట్టుకోని ఆపరేషన్ ఫ్రీగా చేయించుకొంటుంటే . ఆ బీదది ఇప్పుడు ఆ కార్డులేక చావుబతుకులమధ్య కొట్టుకుంటున్న పిల్లోడ్ని ఎదనేసుకొని వైద్యం చేయించుకోలేక అందరి కాళ్లా వేళ్ల పడతాండాది. “ కోపంగా మనసులో మాటను సూటిగా కక్కేసాడు.

రుద్ర ఆవేశానికి ఎంకట్రెడ్డి మాన్పడిపోయాడు. నిజానికి అతనికి తనకు రేషన్ కార్డు ఉన్న విషయం తెలియదు ఆపరేషన్ తర్వాత తెలిసింది రాజేంద్ర బాబు వల్ల. ముఖం చిన్న బోయింది తప్పు చేసిన వాడిలా తల దించుకొన్నాడు. అది చూసి రుద్ర నాయనమ్మకు కోపం వచ్చింది. తన కొడుకును అలా నిలదీసి మాట్లాడుతుంటే చేస్తున్న పని ఆపి ,

“ఏందిరా మీ నాయనొక్కడే అట్టా సేసినట్టు తెగ ఇదైపోతుండావు. మీ నాయనకు మాకు గాని అసలు కార్డున్నట్టే తెలీదు . దానికి మనమేమన్నా రేషన్ బియ్యం తెచ్చుకొన్నామా పాడా ఆసుపత్రికి పనికొస్తాదని ఆయన తీసుకొన్నట్టుండాది. గవర్నమెంటోడి డబ్బులే కదా ఎవడి సొమ్మేమన్నా తిన్నామా .దానికే మీ నాయనేందో ఆ పిల్లోడికి ఇచ్చే పైసలు లాక్కోన్నట్టు. పిల్లోడికేదో అన్నాయం సేసినట్టు తెగ మాటాడ్తాండవ్ “అంది రుద్రకన్నా ఆవేశంగా.

“అహా ...ఇట్టా అనే అంతా . అట్టా సేస్తాండారు. గవర్నమెంటు డబ్బులంటే అంత చులకన అందరికి .కాసుక కూర్చుంటారు. తిరిపెంగా కొట్టేస్తామని. అది ఎవరికి ఇస్తాండారు. ఎందుకు ఇస్తాండారు అని ఆలోచించనక్కర్లేదా .

ఎవడికో ఇచ్చినేది మనం తీసుకొంటే ఒకడి నోటికాడిది మనం లాక్కొన్నట్టు గాదా. ఆ డబ్బులన్ని మనం ఉద్దరగా తిన్నట్టే కందా. ఇట్టా తినేడబ్బులన్ని మిగిల్తే ఇంకో దానికి పేదలకు పనికొస్తాది గందా. పైగాబియ్యం తీసుకోవడంలేదని గొప్పగా సెప్తుండావు. నువ్వు బియ్యేం తీసుకొడంలా బాగానే ఉండాది. మరి ఆ బియ్యమాడికిపోతుండాయి ఆ డీలరు అమ్ముకొంటుడాడు. దాని పైన ప్రభుత్వం ఎంత సబ్సిడి పెడ్తాండాది. దాని వల్ల ఎన్ని కో ట్లు పక్కదారి పడుతుండాది. ఎప్పుడో వచ్చేరోగంకోసం తెల్లకార్డులకావాలని ఎగబడి పలుకుబడి పెట్టి కార్డులు తీసుకొంటాడారు. అది ఎన్నందాల నష్టమో తెలీడంలా ....అదంతా మనకు అక్కర్లే .మనకు మిగిలింది సాలు . ఎవడెట్టా పోతే మనకెందుకు.. “ రుద్ర ముఖం ఎర్రబడింది.

రుద్ర ఒక్కడే కాదు. చాలా మంది తన ఎదరుగా నిలబడి నిలదీస్తున్నట్లు అనిపించింది ఎంకట్రెడ్డికి. ఏమి మాట్లడలేక పోయాడు. సావిత్రమ్మ ఏదో చెప్పబోతుంటే రుద్రనే మళ్లా మాట్లాడాడు.

“రేషన్ కార్డును ఇప్పుడన్నా సరెండరు సేస్తాం నాయనా బాగుంటాది. అదే కాదు నాయనా సమయమొచ్చినాది కాబట్టి సెప్తుండా. మీరు రాజకీయల్లోకి వచ్చినేది పదవి కావాలనుకొనేది అధికారంకోసరం పదిమందిలో గుర్తింపు ఉండేదానికోసమే అని సానా మార్లు అనింద్రు. అదే నిజమని అనుకొంటుండా. అట్టా కాక మీరు కూడ అందరి మాదిరిగా మీరు డబ్బు సంపాదించేదానికే రాజకీయాల్లోకి వచ్చింద్రని మీ మనుసులో ఉంటే అది తుడుపేయండి. అట్టా సంపాదించిన ఎవర్దో ఎంగిలి కూడు మనకు అక్కర్లే అయి ఎన్ని కొట్లైనా. మీరట్టా సేసే కొద్ది నేను మీకు దూరమైపోతా .” “.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS